రోడ్డుపై గుంతలు.. తప్పని తిప్పలు

- పట్టించుకోని మున్సిపల్‌శాఖ
- అధ్వానంగా ప్రధానదారి
- ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో నిర్మించాలని ప్రజల వేడుకోలు

జ్యోతినగర్: అసలే వర్షాకాలం.. అధ్వానంగా ఉన్న రహదారిపై నీరు నిలిచి ఉండడంతో ఎక్కడ గుంతలున్నాయో తెలియక ప్రమాదాల భయం వాహనదారులను వెంటాడుతోంది. మరమ్మతు నిర్వహించాల్సిన అధికారులు దృష్టి సారించడం లేదు. వాహనాలు అదుపుతప్పి పడిపోయి పలువురు గాయాలబారిన పడుతున్నారు. ఎన్టీపీసీ రామగుండం రాజీవ్ రహదారి నుంచి సింధూర కళాశాల వైపు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. జంగాలపల్లె, నర్రాశాలపల్లె, రామయ్యపల్లె, మల్కాపూర్ గ్రామాలకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం పలు వాహనాలు ఈ దారిన వెళ్తాయి. ఈ రోడ్డులోనే ఫంక్షన్ హాళ్లు, పెద్ద హోటళ్లు ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షం నీటితో రోడ్డుపై ఉన్న అడుగులోతు పైగల గుంతల్లో నీరు నిలిచి పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయి.



గుంతలతో ఉన్న రోడ్డు

ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో నిర్మించాలి..

ఎన్టీపీసీ రామగుండం ప్రభావిత గ్రామాలైన నర్రాశాలపల్లెకు వెళ్లే ప్రధాన రహదారిని గతంలో సీఎస్సార్ నిధులతో నిర్మించారు. రోడ్డు నిర్మించి చాలా ఏళ్లు గడవడంతో గుంతలమయంగా మారింది. సంస్థ మనుగడలో ప్రభావిత ప్రాంత ప్రజల సహకారం ఉన్నందున నిధులు విడుదల చేసి రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నాలుగు గ్రామాలకు ప్రధాన దారి..

నర్రాశాలపల్లె, మల్కాపూర్, జంగాలపల్లె, రామయ్యపల్లె గ్రామాలకు ప్రధాన రహదారితో పాటు పలు ఫంక్షన్ హాళ్లు, పెద్ద హోటళ్లు ఉండటంతో రహదారిపై వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు.

ఇబ్బందులు తొలగించాలి



రాజీవ్ రహదారి నుంచి సింధూర కళాశాల వైపు వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఉన్నాయి. ప్రయాణం కష్టంగా ఉంది. పెద్ద పెద్ద గుంతల్లో వాహనాలు పడి చాలా మందికి గాయాలయ్యాయి. రోడ్డు నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– జానకీరాం, ఎన్టీపీసీ మాజీ ఉద్యోగి

బైక్‌పై వెళ్లాలంటే భయం



రాత్రి సమయాల్లో ఈరోడ్డులో బైక్‌పై వెళ్లాలంటే చాలా భయంగా ఉంది. గుంతలు కనిపించక వాహనాలు అదుపు తప్పుతున్నాయి. చాలాప్రజలు, ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు రోజంతా ఈరోడ్డు గుండా వెళ్తుంటారు. ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలి.

– బట్టు లక్ష్మణ్, మాజీ ఉద్యోగి, ఎన్టీపీసీ

క్లుప్తంగా

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలో ఫోర్‌లైన్ రహదారిపై నూతనంగా నిర్మించిన రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని సోమవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పరిశీలించారు. పెండింగ్ పనులను పూర్తిచేయాలని హెచ్‌కేఆర్, సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా గోదావరిఖని నుంచి బసంత్‌నగర్ వరకు ఫోర్‌లైన్ రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు తొలగించి, రహదారిపై గుంతలను పూడ్చాలని అధికారులను ఆదేశించారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

గోదావరిఖని: వన మహోత్సవంలో భాగంగా స్థానిక సంజయ్‌గాంధీనగర్‌లో ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సోమవారం మొక్కలు నాటారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న దంపతులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని ఐతరాజుపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం 19వ వార్షిక వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, హోమం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రామగిరి: బొగ్గుగనుల వేలాన్ని నిరసిస్తూ సోమవారం ఆర్జీ–3 డివిజన్ ఓసీపీ–2లో టీబీజీకేఎస్ నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విధానాలను నిరసిస్తూ బొగ్గు గనులను వేలం లేకుండా సింగరేణి సంస్థకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. టీబీజీకేఎస్ నాయకులు గండి శ్రీనివాస్‌గౌడ్, వీరవేని సంతోశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీ

ఎలిగేడు: మండలంలోని పలు ఎరువుల షాపుల్లో సోమవారం మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల షాపు స్టాకు రిజిస్టర్లు, బిల్లు బుక్‌లను తనిఖీ చేసి పరిశీలించారు. ఎరువుల విక్రయాలను ఈపాస్ మిషన్ ద్వారా చేయాలని సూచించారు. మండలంలో ఏవో పర్యటించి పత్తి పంట వివరాలను నమోదు చేశారు. ఏఈవోలు ఉన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

సుల్తానాబాద్: పట్టణంలోని స్వప్నకాలనీలో ఉన్న సాయిబాబా ఆలయం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం గణపతి పూజతో ప్రారంభించారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, కమిటీ కార్యదర్శి జూలూరు అశోక్‌కుమార్, వెంగల్‌దాస్ శ్రీధర్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కాల్వశ్రీరాంపూర్: క్రీసెంట్ పాఠశాలకు చెందిన అటెండర్ తూండ్ల రాజయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి పాఠశాల స్టాఫ్ రూ.9వేలు అందజేశారు.

ఉద్యోగ విరమణ సన్మానం

కాల్వశ్రీరాంపూర్: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్ అన్నారు. మండలంలోని మంగపేట, వెన్నంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన హెచ్ఎంలు ఏఎస్‌రావు, కె శ్రీనివాస్ ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా సోమవారం ఎంపీపీ, ఉపాధ్యాయులు, కార్యదర్శులు ఘనంగా సన్మానం చేశారు.

ఆలయంలో అన్నదానం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నేనున్నా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతీ సోమవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని భక్తుల సహకారంతో ప్రారంభించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వజ్రారెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేశం తెలిపారు.

ఉపాధిహామీ నిధుల దుర్వినియోగం

పాలకుర్తి: పాలకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ మండలస్థాయి సమావేశం నిర్వహించారు. వారంరోజులుగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు మండల పరిధిలోని గ్రామాల్లో చేసిన సర్వే నివేదికను ఉన్నతాధికారులకు నివేదించారు. మండలంలోని ఏడు గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనుల్లో మొత్తం రూ.10,065 నిధులు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. పెద్దపల్లి డీఆర్డీవో రవీందర్, ఏపీడీ సత్యనారాయణ, డీవీవో కొమురయ్య, అసిస్టెంట్ డీవీవో గణేశ్, అంబుడ్స్‌మన్ శరత్, స్టేట్ రిసోర్స్ పర్సన్ మహేశ్, పాలకుర్తి జెడ్పీటీసీ సంధ్యారాణి, ఎంపీడీవో శశికళ, ఎంపీవో షబ్బీర్‌పాషా, ఏపీఎంలు కొమురయ్య, రమేశ్, టెక్నికల్ అసిస్టెంట్లు అఖిల, సమ్మయ్య, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సోషల్ ఆడిటర్లు పాల్గొన్నారు.



సమావేశంలో డీఆర్డీవో రవీందర్

మెడికల్ కళాశాలకు వృద్ధుడి దేహదానం

కోల్‌సిటీ: గోదావరిఖనిలో మరణంలోనూ ఓ నిరుపేద కూలి మహోపకారం చేసి అందరికీ స్ఫూర్తినిచ్చారు. నేత్రదానం చేసి ఇద్దరికి చూపునిచ్చాడు. వైద్య విద్యార్థుల పరిశోధన కోసం తన దేహాన్ని సైతం మెడికల్ కాలేజీకి దానం చేసి ఆదర్శంగా నిలిచారు. మంథని మండలం నాగారం గ్రామానికి చెందిన అనసూరి రాజయ్య(70) నాగారంలో కార్పెంటర్‌గా పని చేస్తుండేవాడు. ఇటీవల అనారోగ్యానికి గురి కాగా సదాశయ ఫౌండేషన్ మంథని అధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాశ్‌రెడ్డి సహకారంతో గ్రామస్తులు గోదావరిఖనిలోని జీజీహెచ్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గ్రామంలో సదాశయ ఫౌండేషన్ నిర్వహించిన నేత్ర, అవయవ, దేహదానంపై అవగాహన పొందిన రాజయ్య, తన మరణం తర్వాత అవయవాలు, శరీరం దానం చేస్తానని గతంలో అంగీకారాన్ని ప్రకటించాడు. దీంతో రాజయ్య కోరిక మేరకు సదాశయ ఫౌండేషన్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా నేత్రాలను సేకరించి వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. అనంతరం రామగుండం సిమ్స్ మెడికల్ కాలేజీకి అనాటమి హెచ్‌వోడీ డాక్టర్ రాహుల్ సమక్షంలో దేహాన్ని అందజేశారు.

తెగిపడిన హైటెన్షన్ కరెంట్ వైర్లు

- తప్పిన పెను ప్రమాదం

పాలకుర్తి(రామగుండం): మండలంలోని ధర్మారం క్రాస్‌రోడ్ నుంచి బసంత్‌నగర్ విమానాశ్రయానికి వెళ్లే ప్రధాన దారిపై సోమవారం హైటెన్షన్ కరెంట్ వైర్లు తెగి, సమీపంలోని 11 కేవీ విద్యుత్ వైర్లపై పడటంతో ఒక్కసారిగా భారీ శబ్దం వచ్చింది. పెద్దపల్లి మండలంలోని కురుమపల్లి గ్రామంలో ఒకటి, రెండు చోట్ల తీగలు తెగిపడ్డాయి. దీంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. పెనుప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని, మరమ్మతు చేయించారు.



రోడ్డుపై పడిన విద్యుత్ తీగ

సంక్షిప్త వార్తలు

నర్సరీలో మొక్కలపై ఆరా

రామగుండం: వన నర్సరీల్లో మొక్కల రకాలు, లభ్యత తదితర అంశాలపై సోమవారం ఎంపీడీవో ఎంఏ.అలీం క్షేత్రస్థాయిలో నర్సరీలను సందర్శించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కలెక్టర్ ఆదేశాల మేరకు వనమహోత్సవం ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

కమాన్‌పూర్: ఈ నెల నుంచి అమల్లోకి వచ్చిన నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతూ తహసీల్దార్ ఆరిఫొద్దీన్‌కు బీఆర్ఎస్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో శేషయ్యసూరికి వినతిపత్రం అందజేశారు. బొమ్మగాని అనిల్, గుర్రం లక్ష్మిమల్లు, నీలం శ్రీనివాస్, సాగర్ల పవన్, శ్రీనివాస్, రాజ్‌కుమార్ ఉన్నారు.

ధరణి విజన్ సెంటర్ ప్రారంభం

ధర్మారం: మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ధరణి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధరణి విజన్ సెంటర్‌ను సోమవారం ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ ప్రారంభించారు. డాక్టర్ భాస్కర్ మడేకార్ లయన్‌కంటి ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక సూర్య ఆదిత్య నర్సింగ్‌హోంలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ద్వారా ఉచిత కంటి పరీక్షలు, అర్హులైన వారికి రేకుర్తి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తారని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి

యైటింక్లయిన్‌కాలనీ: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని కోరుతూ టీఎస్ఎస్ఎఫ్ నాయకులు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం అందించారు. టీఎస్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు ఎండీ వాజిద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న జిల్లాలోని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సతీశ్, అజయ్ పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

యైటింక్లయిన్‌కాలనీ: భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను సోమవారం యైటింక్లయిన్‌కాలనీ బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. దళితమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశిపేట శివాజీ, బీజేపీ నాయకులు స్థానిక శ్రీవాణి పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సంతోష్ నగర్‌లోని కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పెద్దపల్లిరూరల్: మహిళలు చట్టాలపై కనీస అవగాహన కలిగి యుండాలని షీటీం ఎస్సై రాజేంద్రప్రసాద్ అన్నారు. పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మణిగణేశన్‌తో పాటు వంశీకృష్ణ, శ్రీనివాస్, సుచరిత, స్వప్న, సంధ్య, అశ్రిత, సంధ్యారాణి, అస్మా ఉన్నారు.

వనమహోత్సవం విజయవంతం చేయాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలో వనమహోత్సవ కార్యక్రమ లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు తవ్వించాలన్నారు. నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎంపీవో సుదర్శన్, ఏపీవో రమేశ్‌బాబు ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

మంథని: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 69ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంథని ప్రభుత్వాసుపత్రి రోగులకు పండ్లు పంపిణీ చేసారు.

ఓదెల కవికి పీవీ నర్సింహారావు అవార్డు



అవార్డుతో రవీంద్రచారి

ఓదెల: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి ఉత్సవాలు 2024లో భాగంగా కరీంనగర్ ఫిలింభవన్‌లో జరిగిన జాతీయ పురస్కారాల్లో ఓదెల గ్రామానికి చెందిన యువ కవి బ్రహ్మాండ్లపల్లె రవీంద్రచారి మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అవార్డు ఆదివారం రాత్రి అందుకున్నారు. కళ విరాట్ వంగల శాంతికృష్ణామాచార్యులు, ప్రముఖ సినీ హాస్యనటుడు ఆర్ఎస్ నంద, స్వచ్ఛంద సంస్థల జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ చేతుల మీదుగా రవీంద్రచారి పురస్కారం అందుకున్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం

రామగిరి: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌ను సోమవారం యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్టీపీసీ గెస్ట్ హౌజ్‌లో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ నాయకులు అడ్డూరి ప్రవీణ్, అడ్డూరి నవీన్ ఉన్నారు.

చెరువు కట్ట కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మంథని: మండలంలోని బిట్టుపల్లి చెరువు కట్ట భూమిని ఇద్దరు రైతులు ఆక్రమించారని స్థానికులు సోమవారం పెద్దపల్లిలో కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫిర్యాదు చేశారు. చెరువు శిఖం కింది భూములకు వెళ్లేందుకు రాధాకిషన్ అనే రైతు ఉచితంగా భూమి ఇచ్చాడని, కానీ రహదారిని కొందరు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యార్థులకు భరోసా

రామగుండం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు 'భరోసా' స్వచ్ఛంద సంస్థ అండగా నిలుస్తుందని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం భరోసా సంస్థ అందజేసిన షూస్‌ను మహేశ్ చేతుల మీదుగా అందజేశారు. స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు నసీమను అభినందించారు. పాఠశాల హెచ్ఎం.లింగమూర్తి, సత్యనారాయణ, సంగనవేణి శేఖర్, స్వామి, రవి, ఊరటి మహేశ్, పెండ్యాల వెంకటేశ్, రబ్బాని పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రామగిరి మండలం చందనాపూర్, సింగిరెడ్డిపల్లి గ్రామంలో పేకాట స్థావరాలపై పోలీసులు సోమవారం దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం చందనాపూర్, సింగిరెడ్డిపల్లిలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో టూటౌన్ ఎస్సై సనత్ కుమార్, వెంకటేశ్ సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. చందనాపూర్‌కు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3410 స్వాధీనం చేసుకొని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు టూటౌన్ పోలీసుల తెలిపారు.

సర్వాయి పాపన్న విగ్రహానికి భూమిపూజ

కాల్వశ్రీరాంపూర్: సర్వాయిపాపన్న విగ్రహ నిర్మాణం కోసం మొట్లపల్లి చౌరస్తాలో సోమవారం కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రరణ్‌రెడ్డి సొంత నిధులతో భూమిపూజ చేశారు. సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మొట్లపల్లి మాజీ సర్పంచు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తులా మనోహర్‌రావు, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, తిరుపతిగౌడ్, రాజకుమార్‌గౌడ్, చిరంజీవిగౌడ్, రవీందర్‌గౌడ్, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

మంత్రివర్గంలో మున్నూరుకాపులకు స్థానం కల్పించాలి

మున్నూరుకాపు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆరె దశరథం పటేల్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈసారి మంత్రివర్గ విస్తరణలో మున్నూరు కాపులకు చోటు కల్పించాలని కోరారు. అనంతరం స్థానిక నాయకులు వారిని సన్మానించారు. మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్, మహేందర్, నిఖిల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కొత్త అశోక్, అభిషేక్ పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏరియాలో 155శాతం బొగ్గు ఉత్పత్తి

గోదావరిఖని: నిర్దేశిత లక్ష్యాలకు మించి 155శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి ఆర్జీ–2 ఏరియా అగ్రగామిగా నిలిచిందని జీఎం ఎల్వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరం జూన్‌లో 4.85లక్షల టన్నుల లక్ష్యానికిగాను 7.53లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి లక్ష్యాల సాధనలో ముందంజలో ఉందన్నారు. అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించడంలో సహకరించిన అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, డీజీఎం (పర్సనల్) జి.రాజేంద్రప్రసాద్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, సివిల్ డీజీఎం ధనుంజయ, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, ఫైనాన్స్ డీజీఎం వెంకటరామచంద్ర, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, డీవైపీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణ

లాభాల్లో 40శాతం వాటా చెల్లించాలి



ఆకుల హరిణ్



సాయివేణ సతీశ్

గోదావరిఖని: సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి అందులో 40శాతం వాటా కార్మికులకు చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జవహర్‌నగర్ సరస్వతి శిశుమందిర్‌లో జరిగిన ఆర్జీ–1 ఏరియా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఏరియా నూతన కమిటీని ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆర్జీ–1 డివిజన్ కమిటీ ఎన్నిక..

ఆర్జీ–1 బీఎంఎస్ డివిజన్ కమిటీని సోమవారం ప్రకటించారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా ఆకుల హరిణ్, కార్యదర్శిగా సాయవేణి సతీశ్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కర్రావుల మహేశ్, సంయుక్త కార్యదర్శులుగా సంగాని సాంబయ్య, బోడకుంట రాజేశం, రామ్మూర్తి, ఎల్లావుల కోటయ్య, రాజశేఖర్, జనగామ తిరుపతి, జి.నరసింహులు ఎన్నికయ్యారు. నాయకులు మండ రమాకాంత్, సారంగపాణి, మాదాసి రవీందర్ పాల్గొన్నారు.

ఆర్జీ–3లో 96శాతం బొగ్గు ఉత్పత్తి

రామగిరి: ఆర్జీ–3లో జూన్‌లో 96 శాతం, ఏపీఏలో తం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు సోమవారం ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు తెలిపారు. జూన్‌లో ఆర్జీ–3లో నిర్దేశించిన 5.28 లక్షల టన్నులకు గాను 5.09 లక్షల టన్నులు అనగా 96శాతం బొగ్గు ఉత్పత్తి, 96శాతం మట్టి తీయడం, 7.14 లక్షల టన్నుల బొగ్గురవాణా జరిగిందన్నారు. ఏపీఏ గనిలో జూన్‌లో నిర్దేశించిన 0.18 లక్షల టన్నులకు గాను 0.65 లక్షల టన్నులు అనగా 365శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడంతో పాటు 0.63లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందని పేర్కొన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లను రద్దు చేయాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. ఓదెల మండలం పొత్కపల్లిలో ఓ ప్రైవేట్ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా నడుస్తోందని, దాని గుర్తింపు రద్దు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్‌స్కూళ్ల యాజమాన్యాలు పుస్తకాలు విక్రయిస్తున్నాయని వాటిని అరికట్టాలని కోరుతూ అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. సిద్ధార్థ, రోషన్, విష్ణు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తాం

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన కోసం యాజమాన్యంతో రాజీలేని పోరాటం చేస్తామని కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరి అన్నారు. కంపెనీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా సోమవారం ఏడుగురు కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం ఆధ్వర్యంలో సన్మానించారు. కౌశికహరి మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి తమ యూనియన్ కృషి చేస్తుందని, కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కంపెనీ హెచ్‌అండ్ఐఆర్ మేనేజర్ పార్థసారథి, కాంట్రాక్ట్ కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, హెచ్ఆర్ అధికారి సదానందం, కార్మికులు తీగల తిరుపతి, శిలగాని శ్రీనివాస్, బైరం మల్లయ్య, సాదిక్, బూర్ల శ్రీనివాస్, సుధాకర్, సంపత్, ముల్కనూరి శ్రీధర్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న కార్మిక సంఘం నాయకులు

పెద్దమ్మతల్లి పట్నాలు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో ముదిరాజ్‌ల కులదైవం పెద్దమ్మతల్లి బోనాలు, పట్నాలు కనుల పండువగా జరిగింది. ఆలయంలో అమ్మవారికి పంబాల పూజారులు పట్నాలు వేసి బోనాల నైవేద్యం సమర్పించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ముదిరాజ్ కులస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నర్సింహయాదవ్, ఎంపీటీసీ రజనీ రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వేణుగోపాలరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, బీజేపీ రాష్ట్ర నాయకులు జెల్ల కనక శేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, నాయకులు గండు సంజీవ్, పెసరు లచ్చయ్య పాల్గొన్నారు.



మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

'రైతు భరోసా'పై అభిప్రాయాల సేకరణ

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రైతువేదికలో సోమవారం కమాన్‌పూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుభరోసాపై అభిప్రాయాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పలువురు రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకోగా 5 నుంచి 10ఎకరాల వారికి, ఐటీతో సంబంధం లేకుండా పంటలు సాగు చేసే రైతులకు రైతుభరోసా పథకం వర్తింపజేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, ఏవో ప్రమోద్‌కుమార్, వైస్‌చైర్మన్ చిందం తిరుపతి పాల్గొన్నారు.

సాగు భూములనే పరిగణనలోకి తీసుకోవాలి

ముత్తారం: ముత్తారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం రైతు అభిప్రాయల సేకరణ సభ జరిగింది. ఆ సంఘం చైర్మన్ అల్లాడి యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రభుత్వం రైతుభరోసా పథకం వర్తింపు కోసం రైతుల అభిప్రాయాలను సేకరించారు. పలువురు రైతులు మాట్లాడుతూ సాగులో ఉన్న భూములను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పంటకు మద్దతు ధర పెంచితే రైతుభరోసా అవసరం లేదని పలువురు రైతులు పేర్కొన్నారు. రైతుల అభిప్రాయాల అనంతరం కరీంనగర్ డీసీవో సముద్రాల రామాంజనేయ ఆచార్యులు మాట్లాడుతూ సభలో సేకరించిన రైతు అభిప్రాయల నివేదికను ఉన్నత అధికారులు ప్రభుత్వానికి అందజేస్తారన్నారు. సొసైటీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ మునిఫర్ అహ్మద్, సీఈవో దాసరి ప్రసాద్, మండల వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఏలువాక కొమురయ్య పాల్గొన్నారు.